## పెరిక సంఘం గ్రామ కార్యవర్గం

బెల్లంపల్లి రూరల్, జనవరి 8: బెల్లంపల్లి మండలంలోని పెర్కపల్లి గ్రామ పెరిక సంఘం అధ్యక్షుడిగా బొలిశెట్టి సుధాకర్, ఉపాధ్యక్షుడిగా ఆకిరెడ్డి నవీన్, ప్రధాన కార్యదర్శిగా సింగతి విజయ్‌కుమార్, కోశాధికారిగా బాకం సుమన్, ప్రచార కార్యదర్శిగా సింగతి సాయికుమార్, గౌరవ అధ్యక్షులుగా బాకం అంజయ్యను పెరిక సంఘం నాయకులు ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆకిరెడ్డి శంకర్ నియామక పత్రాలను అందజేశారు. ఎన్నికల్లో ఎంబడి కిషన్, కందుల రాకేశ్, అచ్చె శివ, ముత్తె మురళి, మీసా రమేశ్, బోడకుంట సాగర్ పరిశీలకులుగా వ్యవహరించారు. సంఘం నాయకులు మార్తాబాపు, ముత్తె రాములు, బొప్ప అర్జయ్య, దాసరి నారాయణ, అచ్చె సత్తయ్య, ఈర్ల అంజయ్య, గుంపుల తిరుపతి, తిప్పని రాయమల్లు, తొంగల శ్రీనివాస్, అచ్చె శివాజీ, బియ్యాల శ్రీనాథ్, సింగతి సత్యనారాయణ, కందుల సత్యనారాయణ, పెట్టం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## శబరిమలకు పయనం

లక్షెట్టిపేట, జనవరి 8: లక్షెట్టిపేట పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు సోమవారం శబరిమలకు బయలుదేరారు. 60 మంది అయ్యప్ప స్వాములు 41 రోజుల దీక్షను పూర్తి చేసుకొని శ్రీచక్రవర్తుల పురుషోత్తమాచార్య గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడులను కట్టించుకున్నారు. అనంతరం హనుమాన్ ఆలయం నుంచి స్వాములు స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు శరణు ఘోషతో పాదయాత్ర నిర్వహించారు.

## పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజేశ్వర్‌రావు

దండేపల్లి, జనవరి8: దండేపల్లి జడ్పీ ఉన్నత పా ఠశాలకు చెందిన సంఘర్ష్ రాజేశ్వర్‌రావు పీ ఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు సం ఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, సూరినేని గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పీఆర్టీ యూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, ఉపాధ్యాయ, వి ద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిన మండల శాఖ బాధ్యులు ఇప్ప రవి, పానుగంటి లచ్చయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

లక్షెట్టిపేట, జనవరి 8: పీఆర్టీయూ రాష్ట్ర కమిటీలో మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు చోటు దక్కింది. రంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో సోమవారం జరిగిన పీఆర్టీయూ రాష్ట్ర కొత్త కార్యవర్గ ఎన్నికల్లో గుల్లకోట ఉన్నత పాఠశాలకు చెందిన రవి కాంత్‌రావు, లక్ష్మీపూర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కొత్త సురేశ్‌ను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు లక్షెట్టిపేట మండల అధ్యక్ష కార్యదర్శులు బైరి రామన్న, రాంమోహన్ రెడ్డి తెలిపారు.

## భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర

జన్నారం, జనవరి 8: మండలంలోని పొనకల్ జీపీలో సోమవారం భారత్ వికసిత్ సంకల్ప్ యాత్రను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, దీన్ దయాళ్, అంత్యోదయ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్, జీవన్ జ్యోతి పథకాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ జక్కు భూమేశ్, కార్యదర్శి రాహుల్, దుమల్ల రమేశ్, మల్లయ్య, ఉన్నారు.

## ఈ నెల 11న మెగా రక్తదాన శిబిరం

మంచిర్యాల ఏసీసీ, జనవరి 8: ఈ నెల 12న స్వామి వివేకానంద 161 వ జయంతి సందర్భంగా మంచిర్యాల ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో 11న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఫర్ బ్లడ్ డొనేషన్ క్యాంప్ లయన్ వీ మధుసూదన్ రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. అలాగే హార్ట్ ఫుల్ నెస్ సంస్థ సహకారంతో విద్యార్థులు, యువతకు మానసిక పరివర్తన, ఆధ్యాత్మికతపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దాతలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మంచిర్యాల పట్టణంలోని గోదావరి రోడ్‌లో గల ఏకల వ్య ఆశ్రమం దగ్గరలోని హరి నిలయం కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 11 న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

### చిన్నారులపై అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక శ్రద్ధ

- చదువుతో పాటు పౌష్టికాహారం అందజేత
- పిల్లల్లో ఎదుగుదల లోపాలపై దృష్టి
- తాండూర్ మండలంలో 1945 మందికి లబ్ధి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాలు నేర్పుతున్న అంగన్‌వాడీ టీచర్లు (ఫైల్)

తాండూర్, జనవరి 8: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమ శాఖను బలోపేతం చేసింది. దీంతో చిన్నారుల బరువు తక్కువ, రక్త హీనత, పెరగక పోవడం, ఇతర సమస్యలన్నింటిపై దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్‌బీఎస్కే ద్వారా శిబిరాల్లో చిన్నారులకు పరీక్షలు చేయిస్తున్నారు. వీరికి ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా ఆరు నె లల నుంచి మూడేండ్ల లోపు చిన్నారులు, 3-6 ఏండ్ల లోపు పిల్లలకు బాలామృతం, గుడ్డు, రోజు విడిచి రోజు ఆకు కూరల వంటి పౌష్టికాహారం అందిస్తున్నా. అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలకు చదువు-ఆరోగ్యం అందించే నేస్తాలుగా మారాయి.

#### స్థాయిని బట్టి బోధన..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం ప్రతి టీచర్ ఆంగ్లంలో పిల్లలకు ప్రీ స్కూల్ విద్యా బోధన చేస్తున్నారు. రెండున్నర నుంచి మూడేండ్ల వయస్సు వారిని నర్సరీ, మూడు, నాలుగు ఏండ్ల వయస్సు వారిని యూకేజీగా విభజిస్తారు. స్థాయిని బట్టి అక్షరాలు, అంకెలు బోధన చేస్తున్నారు. నాలుగేండ్ల పైబడిన వారికి సృజనాత్మక కృత్యాలను చూపిస్తూ నేర్పిస్తారు. చిన్నారులకు ఆలోచింపజేసే చిట్టికథలు చెబుతారు. వాటి సారాంశాన్ని వారితోనే చెప్పించే ప్రయత్నం చేస్తారు. మధ్యాహ్న భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకునే విధానం, ఎవరికి వారే అన్నం తినేలా దగ్గర ఉండి నేర్పిస్తారు. చిన్నారులను



విద్యాబుద్ధులు నేర్పుతున్న అంగన్‌వాడీ టీచర్ (ఫైల్)

మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండున్నర గంటల వరకు నిద్ర పుచ్చుతారు. తర్వాత పునశ్చరణ తరగతులతో పాటు టీచర్లు వారితో 4 గంటల వరకు ఆడిస్తారు.

#### ఆన్‌లైన్‌లో నిక్షిప్తం..

ఒకప్పుడు అంగన్‌వాడీ సేవలు మాన్యువల్‌గా ఉండేవి. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ప్రతి సేవను పారదర్శకత కోసం ఆన్‌లైన్ చేసింది. అందుకు అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు అందించింది. దీంతో పాటు వారికి ప్రత్యేక శిక్షణను ఐసీడీఎస్ అధికారులు అందించారు.

#### మండల వ్యాప్తంగా 1945 మందికి లబ్ధి..

మండల వ్యాప్తంగా తాండూర్, మాదారం రెండు సెక్టార్లలో ఉన్న 64 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేండ్ల లోపు వారు మొత్తం 1945 మంది చిన్నారులు అంగన్ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్నారు. వీరికి పౌష్టికాహారం అందిస్తూ ఆటపాటలతో చదివిస్తున్నారు. సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తారు.

#### ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి..



పిల్లల ఆరోగ్య సంరక్షణతో పాటు అంగన్‌వాడీ టీచర్లు చదువు పైనా దృష్టి సారిస్తున్నారు. అక్షరాలు రాయలేని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. రక్త హీనత, పోషకాహార లోపంతో బరువు తక్కువ ఉన్న పిల్లలకు బాలామృతం, గుడ్డు అందించడంతో పా టు వైద్యుల సలహాలను వారి తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. నెల నెలా వారిలో కలిగే మార్పులను నమోదు చేస్తున్నారు. ఆట పాటలతో విద్య బోధిస్తున్నారు. మూడు నెలలకోసారి వారి పురోగతిపై ప్రోగ్రెస్ రిపోర్టు అందజేస్తారు.

-మాస ఉమాదేవి, సీడీపీవో, బెల్లంపల్లి



హాజరైన పూర్వ విద్యార్థులు

## అ'పూర్వ' సమ్మేళనం

కాసిపేట(తాండూర్), జనవరి 8 : తాండూర్ మండలంలోని మాదారం సింగరేణి హై స్కూల్ 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమా లతో అట్టహాసంగా జరుపుకున్నారు. సింగరేణి హై స్కూల్‌లో చదువుకొని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు మరోసారి అదే పాఠశా లలో కలుసుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను సన్మానించారు.

## కొలాం గిరిజనులను ఆదుకోవాలి

హాజీపూర్, జనవరి 8: రాష్ట్ర ప్రభుత్వం కొలాం గిరిజనులను ఆదుకోవాలని ముల్కల్ల సర్పంచ్ మంచాల శ్రీనివాస్ అన్నారు. ముల్కల్ల గ్రామంలో భీమదేవర ఆత్మ గోపురవాణి సందర్భంగా భీమదేవర జెండాను కొలాం గిరిజనులతో కలిసి సోమవారం జెండాను ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం తిరుపతి యాదవ్, మధునయ్య, రాములు, మొగిళి పోశం, కొలాం గిరిజనులు రమేశ్, భీమక్క, రాజు, రాజేశ్ ఉన్నారు.

## ప్రజావాణి

కోటపల్లి, జనవరి 8: కోటపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణిని నిర్వహించారు. ఎంపీడీవో కే భాస్కర్ కోరారు. ఎంపీవో అక్తర్ మోహియోద్దీన్, ఏవో మహేందర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి, జనవరి 8: తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నాలుగు దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ సుధాకర్ దరఖాస్తులను స్వీకరించారు. కల్యాణలక్ష్మి, సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ధరణికి సంబంధించి ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఎంపీడీవో ఏపీఎం, ఏపీవో, వైద్య,అగ్రికల్చర్, ఐసీడీఎస్ విభాగాల అధికారులు హాజరయ్యారు.

వేమనపల్లి, జనవరి 8: వేమనపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఎంపీడీవో లక్ష్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజావాణిలో గొర్లపల్లికి చెందిన స్వేచ్ఛా యువజన సంఘం సభ్యులు దరఖాస్తు అందజేశారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, వ్యవసాయాధికారి వీరన్న, ఏపీఎం ఉమారాణి, సూపర్‌వైజర్ సువర్ణ, అధికారులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

**CHANGE OF NAME**

By this deed I, the undersigned **KUMMARI MUTHYAM S/o. KANUGULA GANGANNA** R/o. H.No.2-48/112, Pakpatla (V). Soan (M) Nirmal (Dist) 504105 have Changed my name to **KANUGULA MUTHYAM S/o. KANUGULA GANGANNA** for all purposes.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## క్యాలెండర్ ఆవిష్కరణ

సీసీసీ నస్పూర్, జనవరి 8: సీసీసీ నస్పూర్ హౌసింగ్ బోర్డు కాలనీలోని లక్ష్మి గణపతి ఆలయంలో వనితా వాక్కు ఫౌండేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కో ఫౌండర్స్ తాళ్లపల్లి కవిత, సునీత కుర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద క్యాలెండర్‌ను ఆవిష్కరించి, అర్చకులు రాంమూర్తిశర్మ, ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరావులకు క్యాలెండర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు అరికట్టడానికి, మహిళల భద్రత, రక్షణ, సాధికారిత లక్ష్యంగా వనితా వాక్కు ఫౌండేషన్ స్థాపించడం జరిగిందన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈనెల 8న హైదరాబాద్‌లోని శ్రీవిద్యా సరస్వతి మాత ఆలయంలో రెండవ క్యాలెండర్ ఆవిష్కరణ, 10వ తేదీన మంచిర్యాల పట్టణ పురప్రముఖులతో క్యాలెండర్ ఆవిష్కరించి, సభ్యులకు పట్టణ ప్రజలకు క్యాలెండర్ అందజేస్తామని ఫౌండర్, అడ్వకేట్, సైకాలజిస్ట్ రంగు వేణుకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షురాలు జ్యోత్స్నచంద్రాదత్, పట్టణ అధ్యక్షురాలు రాచకొండ చందన, కోశాధికారి కొండా శైలజారాంచందర్, సభ్యులు దేవిక, వనిత, రంగు మల్లేశ్, రంగు రమేశ్, పైడిపెల్లి నాగతేజ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

దండేపల్లి, జనవరి 8: దండేపల్లి మండల కేంద్రంలో మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం 2024 క్యాలెండర్, డైరీని తహసీల్దార్ సంధ్యారాణి, ఎస్ఐ ప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షులు పెరుమాండ్ల శంకర్‌గౌడ్, వొల్లాల లచ్చన్న బాపు, కాంతయ్య, అన్నం సత్యనారాయణ, అలిశెట్టి లక్ష్మణ్, జాబు సుగుణాకర్, తదితరులున్నారు.

## ఇంటింటికీ శ్రీరాముడి తలంబ్రాలు

లక్షెట్టిపేట/కోటపల్లి, జనవరి 8: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం హనుమాన్ భక్తులు ఇంటింటికీ తిరుగుతూ లక్షెట్టిపేట పట్టణంలో శ్రీరాముని తలంబ్రాలు అందజేశారు. కోటపల్లి మండలంలోని కోటపల్లి, సర్వాయిపేట గ్రామాల్లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతలను పంపిణీ చేశారు. ఈ నెల 22న కోటపల్లి హనుమాన్ మందిర్‌లో నిర్వహించనున్న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఐక్య వ్యాపార సంఘం అధ్యక్షుడు మైలారపు సుధాకర్, బొప్పు సతీశ్, మోటపల్కుల గురువయ్య, గుండ ప్రభాకర్, బొద్దుకూరి రాజ్‌కుమార్, నలుమాసు వంశీ, శంకర్, లడ్డు, సాగర్, మహిళలు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

బెల్లంపల్లి, జనవరి 8: పట్టణంలోని 1వ వార్డు, కన్నాల బస్తీ నవదుర్గ గణేశ్ మండలి వద్ద సోమవారం టింకరి అఖిల, మాజీ కౌన్సిలర్ పొట్ల సురేశ్, బస్తీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ హాజరై ప్రారంభించారు. కంటి వైద్యుడు అంజయ్య, వైద్య సిబ్బంది, బస్తీవాసులు పాల్గొన్నారు.

## నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేయాలి

బెల్లంపల్లి, జనవరి 8: రైల్వే కార్మికులకు నూతన ఫింఛన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి సాంబశివుడు డిమాండ్ చేశారు. ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జాయింట్ ఫోరం పిలుపు మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం ఎదుట సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 11 వరకు అన్ని బ్రాంచ్‌ల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పాత ఫింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ నాగరాజు, వైస్ చైర్మన్ రమేశ్, నాయకులు సాల్మన్, చిరంజీవి, శోకన్ మీన, ఒద్ది రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ

చెన్నూర్, జనవరి 8: తెలంగాణ షిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా చెన్నూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణను ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ నియమించారు. ఈ మేరకు నీలి విప్లవ ప్రదాత పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎంవీ గుప్తా చేతుల మీదుగా సోమవారం ఆయన నియామక ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని మత్స్యకారుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన మత్స్యకారులకు అందేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

## పీఎఫ్‌లో జమ చేయాలని వినతి

సీసీసీ నస్పూర్, జనవరి 8: మున్సిపల్ కార్మికుల వేతనాల నుంచి కట్ చేసిన డబ్బులు పీఎఫ్‌లో జమ చేయాలని నస్పూర్ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుదమల్ల హరిక్రిష్ణ, నస్పూర్ అధ్యక్షుడు కొయ్యాల వెంకటి, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడేళ్ల నుంచి కాంట్రాక్ట్ కార్మికుల జీతాల నుంచి పీఎఫ్ కోసం రూ.1900 కటింగ్ చేస్తున్నారని తెలిపారు. ఈ డబ్బులు మాత్రం పీఎఫ్ ఖాతాలో జమ చేయడం లేదన్నారు. ఈ విషయంపై చాలా సార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు. అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి విషయం చెప్పామని, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఒకవేళ సమస్య పరిష్కారం కాకుంటే సమ్మె చేసేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కదిరి రాజు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## జాగ్రత్తలపై అవగాహన

కోటపల్లి, జనవరి 8: సుఖ ప్రసవం కోసం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి అవగాహన కల్పించారు. గర్భిణులు ప్రతినెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. స్టాఫ్ నర్స్ గౌతమి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బురదతో ఇబ్బంది

భీమారం, జనవరి 8 : గొల్లవాగు ప్రాజెక్ట్ కాలువ రోడ్డు బురద మయంగా మారింది. గొల్లవాగు కాల్వలో పేరుకపోయిన బురద తోపాటు, చెత్త, తుంగను అధికారులు తొలగించారు. ఇంత వరకు బాగానే ఉన్నా, ఆ చెత్త ను, తుంగను, బురదను కాల్వ రోడ్డుపైనే పడేశారు. దీంతో ఇబ్బం దులకు గురికావాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నేడు వర్క్ షాప్

మంచిర్యాల అర్బన్, జనవరి 8 : జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం సుస్థిరాభివృద్ధి, పర్యావరణంపై ఒకరోజు వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య తెలిపారు. భారత పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, తెలంగాణ నేషనల్ గ్రీన్ గోర్, మంచిర్యాల జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన గ్రీన్ కోర్ పర్యావరణ క్లబ్బులు ఉన్న ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. టీచర్‌తో పాటు 8,9 తరగతులకు చెందిన ముగ్గురు విద్యార్థులతో గ్రీన్ కోర్ జిల్లా కో ఆర్డినేటర్ గుండేటి యో గేశ్వర్‌కు మంగళవారం ఉదయం 9:30 గంట లకు రిపోర్ట్ చేయాలన్నారు.

## చర్యలు తీసుకుంటాం

కాసిపేట(తాండూర్), జనవరి 8: సమయ పాలన పాటించని ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎంఈవో వాసాల ప్రభాకర్ పేర్కొన్నారు. తాండూర్ మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశాన్ని మండల నోడల్ అధికారి సూరమళ్ల మల్లేశం అధ్యక్షతన నిర్వహించారు. ఎంఈవో వాసాల ప్రభాకర్ హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం జయప్రకాశ్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు విద్యాసాగర్, వేణుగోపాల్, రజిత, రాణి, సీఆర్పీలు నాగరాజు, తిరుపతి పాల్గొన్నారు.

## వార్డు సమస్యల పై వినతి

మందమర్రి, జనవరి 8: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు గాంధీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుకు వినతి పత్రం సమర్పించారు. వార్డులో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. యువజన కాంగ్రెస్ నాయకులు ఎండీ.జావీద్‌ఖాన్, రాము, వంశీ, శేఖర్, విజయ్, చంటి, తదితరులున్నారు.

## ఆర్థిక సహాయం

దండేపల్లి, జనవరి 8: మండలంలోని తాళ్లపేట గ్రామానికి చెందిన కోట లచ్చన్న, నేరెళ్ల లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాలను మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్ పరామర్శించి, రూ.8వేల ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి, మాడ దయాకర్, దావూద్‌ఖాన్, రాజశేఖర్, సుంగు, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ల విడుదల

కాసిపేట, జనవరి 8: మంచిర్యాల జిల్లా కేంద్రంలో బంజారా జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 11న నిర్వహించే ప్రేంసింగ్ మహరాజ్ 45వ గురుకృపా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ బదావత్ సంతోష్ ఆవిష్కరించారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ నాయక్ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. మంచిర్యాల బంజారా జేఏసీ అధ్యక్షులు, సోమగూడెం(కే) సర్పంచ్ సపాట్ శంకర్, ఇస్లావత్ ప్రకాశ్ నాయక్, క్రీడాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, సంతోశ్, సందీప్ నాయక్, పూజారి సంకలాల్ నాయక్, లౌఢియా లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు

బెల్లంపల్లి, జనవరి 8: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. రెండవ రోజు సోమవారం నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగింది. మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, మేనేజర్ శ్రీనివాస్ ఆన్‌లైన్ నమోదును పర్యవేక్షించారు. మొత్తం 17,559 దరఖాస్తులు రాగా 15,302 దరఖాస్తులు అభయహస్తం, 2257 ఇతర దరఖాస్తులు వచ్చాయి. మున్సిపాలిటీకి సంబంధించిన 13 మందితో పాటు మరో 15 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.



ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

## ఒకరి ఆత్మహత్య

క్రైం

చెన్నూర్ టౌన్, జనవరి 8: చెన్నూర్ బస్టాండ్ లో సోమవారం ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. బాధితుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటపల్లి మండలం రొయ్యలపల్లి గ్రామానికి చెందిన దుర్గం రాజమల్లు (40) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక కొత్త బస్టాండులో మృతి చెందిన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. రొయ్యలపల్లి గ్రామానికి చెందిన రాజమల్లు మృతదేహమని గుర్తించారు. అప్పుల బాధతో మృతి చెంది ఉంటాడని బాధితుడి బంధువులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రాజమల్లుకు భార్య దుర్గ, కూతురు, కొడుకు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



దండేపల్లి/వేమనపల్లి, జనవరి 8: దండేపల్లి మండలం లోని కన్నెపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిప్ప ప్రసాద్(26) అక్కడికక్కడే మృతి చెం దాడు. ఎస్ఐ ప్రసాద్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వేమనపల్లి మండలం జిల్లెడ గ్రామానికి చెందిన ప్రసాద్ ఆయిల్‌పామ్ కం పెనీలో పని చేస్తున్నాడు. పని నిమిత్తం జగిత్యాలకు వెళ్లి తిరిగి వస్తుండగా, మధ్యాహ్నం కన్నెపల్లి సమీపంలో సదానందయ్య గుడి వద్ద లక్షెట్టిపేట నుంచి ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో ప్రసాద్ తీవ్ర గాయాలై మృతి చెందాడు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపా రు. తల్లిదండ్రులు చిప్ప లక్ష్మి, మల్లయ్య దంపతులకు పెద్ద కుమారుడు ప్రసాద్. కూతురు రవళి ఉంది. కూలీ పనులు చేస్తూనే ఇద్దరినీ చదివించారు. ఆరు నెలల క్రితం ప్రసాద్ మంచిర్యాల జిల్లాలోని ఆయిల్‌పామ్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. బోనాలకు వచ్చి, వెళ్లిన ప్రసాద్ ఇంతలోనే మృతి చెందడం విషాదం నింపింది.

## ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సింగరేణి

శ్రీరాంపూర్, జనవరి 8: కాసిపేట గనిలో కార్మికుడు మచ్చ రమేశ్ మృతికి సింగరేణి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని, యాజమాన్యం బాధ్యత వహించి బాధిత కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ రీజియన్ కార్యదర్శి వంగర రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. కాసిపేట గని మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్ విధి నిర్వహణలో డిసెంబర్ 22 న ప్రమాదానికి గురయ్యారని పేర్కొన్నారు. ఈ క్రమంలో గోదావరిఖని ఏరియాస్పత్రిలో 16 రోజులు ఉన్నా, సరైన చికిత్స అందకపోవడంతో, ఆయన మృతి చెందాడని తెలిపారు. కుటుంబంలో ఒకరికి సుటేబుల్ జాబ్ ఇవ్వాలన్నారు. మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి సత్యనారా యణ, సుభాష్, జావేద్, రాజేశ్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కాసిపేట, జనవరి 8: కాసిపేట గనిలో గాయపడి, గోదావరిఖని ఏరియా దవాఖానలో చికిత్స పొందుతూ మచ్చ రమేశ్ మృతి చెందగా, బాధిత కుటుంబానికి రూ.కోటి నష్ట పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఏఐటీయూసీ మందమర్రి, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శులు సాలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేశ్ డిమాండ్ చేశారు. నాయకులు సుభాష్ చంద్ర బోస్, జోగు కేతన్, గోదారి లింగమూర్తి పాల్గొన్నారు.

## లాకర్స్ ఏర్పాటు చేయాలని వినతి

శ్రీరాంపూర్, జనవరి 8: స్థానిక ఆర్కే 5గనిపై కార్మికులకు కబ్ బోర్డులు, లాకర్స్ సదుపాయం కల్పించాలని కోరుతూ సోమవారం గని ఇన్‌చార్జి మేనేజర్ శివయ్యకు ఐఎన్టీయూసీ పిట్ కార్యదర్శి ఆకుల రాజయ్య, ఆర్ మహేందర్‌రెడ్డి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గనిపై కార్మికుల వస్తువులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. విలువైన వస్తువులు చోరీ అవుతున్నాయని పేర్కొన్నారు. ఐఎన్టీయూసీ నాయ కులు జగదీశ్, ఎం రాజేందర్, స్వామి, ప్రతాప్, సురేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, సమ్మయ్య, శ్రీనివాసరావు, నీలం సదయ్య పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్, జనవరి 8: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2024 కార్యలెండర్‌ను సోమవారం జీఎం ఆఫీస్‌లో జీఎం సంజీవరెడ్డి ఆవిష్కరించారు. శ్రీరాంపూర్ ఏరియా లైజన్ ఆఫీసర్ ఎస్ఈ కిరణ్‌కుమార్, లా ఆఫీసర్ మాదాసి మల్లేశ్, చీఫ్ అడ్వైజర్ డీవైజీఎం చిరజీవులు, ఏరియా ఉపాధ్యక్షుడు దేగల ప్రవీణ్ ఆధ్వర్యంలో జీఎం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి కుక్క శ్రీనివాస్, ఏరియా కార్యదర్శి అందె వెంకటేశ్, కోశాధికారి గోదారి మురళి, సంయుక్త కార్యదర్శి శంకరయ్య, పెద్దయ్య, నాయకులు కమల్, నర్సింగారావు పాల్గొన్నారు.